కలం
kalamdaily.com
Follow on: Kalamtelugu
శనివారం, మార్చి 14, 2026
ప్రజల గళం...
పేజీలు: 2

360° SINGLE TOPIC

బుకింగ్ ప్రాబ్లమ్స్

ప్రభుత్వం ఎన్ని మాటలు చెప్పినా, అధికారులతో ఎన్ని రివ్యూలు చేసినా రాష్ట్రంలో వంట గ్యాస్ కష్టాలు మాత్రం తీరట్లేదు. పట్నం నుంచి పల్లె దాకా ఇదే తంతు. ఏజెన్సీలు, గోడౌన్ల దగ్గర ఖాళీ సిలిండర్లు దర్శనమిస్తున్నాయి. సర్వర్లు మొరాయించడంతో బుకింగ్‌లు ఆగిపోయాయి. టోల్ ఫ్రీ, కస్టమర్‌కేర్ నెంబర్లు కనెక్ట్ కావడంలేదు. అదృష్టం కొద్దీ కనెక్ట్ అయినా ఓటీపీలు జనరేట్ కావడంలేదు. అది లేకుండా ఏజెన్సీలు డెలివరీ చేయడంలేదు. ఇప్పటికే బుకింగ్ ప్రాసెస్ కంప్లీట్ అయ్యి ఓటీపీలు వచ్చినా రీఫిల్లింగ్ సిలిండర్లు అందడంలేదు. స్టాక్ వచ్చాకనే ఇస్తామంటూ డీలర్లు సర్దిచెప్తున్నారు. ఏజెన్సీలు ఒక చోట, గోడౌన్లు మరో చోట ఉండడంతో జనం ఈ రెంటి మధ్య చక్కర్లు కొడుతున్నారు. స్టాక్ ఎప్పుడొస్తుందో వినియోగదారులకు తెలియదు.. వచ్చాక బినామీ, బోగస్ పేర్లతో ఎవరికి డెలివరీ అవుతున్నాయో అర్థం కాదు. సందట్లో సడేమియా అన్నట్లుగా దొడ్డి దారిన ఎక్కువ రేటుకు అమ్ముకునే దందా కంటికి కనిపించకుండా జరిగిపోతున్నది. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న గ్యాస్ ఇక్కట్లపై కలం 360 డిగ్రీస్ కథనం..

తెలంగాణ బ్యూరో, కలం



# గ్యాస్ బుకింగ్..
# ఔటాఫ్ కవరేజ్

## మొరాయిస్తున్న సర్వర్లు.. ఆన్‌లైన్ బుకింగ్ తిప్పలు
## ఏజెన్సీల ముందు బారులు తీరుతున్న డొమెస్టిక్ కస్టమర్లు
## ఆగిన 'కమర్షియల్' సప్లయ్.. హోటళ్లు, రెస్టారెంట్లు క్లోజ్
## జోరుగా బ్లాక్ మార్కెట్ దందా.. రాష్ట్రమంతా ఇదే పరిస్థితి

**కలం, నల్లగొండ:**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గ్యాస్ కోసం వినియోగదారులు అరిగోస పడుతున్నారు. నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడ, భువనగిరి వంటి టౌన్లలో గ్యాస్ ఏజెన్సీల ముందు తెల్లవారుజాము నుంచే జనం క్యూ కడుతున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ చేసినా ఔటాఫ్ స్టాక్ అని వస్తున్నది. గోడౌన్ల వద్దకు వెళ్లి సిలిండర్ల కోసం క్యూ కడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం కమర్షియల్ సిలిండర్ల సరఫరా 80 శాతం వరకు పడిపోయింది. దీంతో కొందరు హోటల్ యజమానులు డొమెస్టిక్ సిలిండర్లను కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా సామాన్యుల కోటా పక్కదారి పడుతున్నది. వ్యాపారుల అవకాశాన్ని ఆసరాగా చేసుకుని దళారులు రంగంలోకి దిగి.. ఉన్న ధర కంటే వెయ్యి రూపాయలు అదనంగా వసూలు చేస్తూ బ్లాక్ మార్కెట్‌లో సిలిండర్లను అమ్ముతున్నారు. అత్యవసరమైన వారు చేసేదేం లేక కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు గ్యాస్ దొరక్కపోవడంతో కట్టెల పొయ్యిలను పెట్టుకుంటున్నారు. టీ, టిఫిన్ల ధరలను రూ. 5 నుంచి 10 వరకు వ్యాపారులు పెంచేశారు. ప్రముఖ హోటల్స్, రెస్టారెంట్లలో ఏకంగా రూ.20 పెంచేశారు. స్టాక్ లేక చిన్న హోటళ్లు మధ్యాహ్నం వేళ భోజనం నిలిపివేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రోజుకు సగటున 30 వేల సిలిండర్లు డెలివరీ అవుతుంటాయి. సగటున ఒక్కో కుటుంబం 2 నెలలకు ఒక సిలిండర్‌ను వినియోగిస్తుంటుంది.

**ఉమ్మడి నల్లగొండ జిల్లా**
- గ్యాస్ ఏజెన్సీలు - 110
- కనెక్షన్లు - దాదాపు 14 లక్షలు
- కమర్షియల్ - 45 వేలు

### పది రోజులైనా గ్యాస్ రాలేదు

పది రోజుల కింద గ్యాస్ బుకింగ్ చేశాను. ఇంతవరకు రాలేదు. ఏజెన్సీకి వెళ్తే లారీ రాలేదని చెప్పారు. ఇంట్లో గ్యాస్ అయిపోవచ్చింది. ఇప్పుడు వంట ఎలా చేయాలో తెలియడంలేదు. అధికారులు స్పందించి గ్యాస్ త్వరగా అందేలా చూడాలి. సోమవారం నుంచి పిల్లలకు హాఫ్ డే స్కూల్స్. పొద్దునే వంట చేయాలంటే గ్యాస్ లేకపోతే చాలా కష్టం.

- రాజేశ్వరీ, గృహిణి, నల్లగొండ

### బ్లాక్‌లో ఎక్కువ ధరకు..

కమర్షియల్ సిలిండర్ అడిగితే అసలు స్టాక్ లేదంటున్నారు. హోటల్ నడవాలంటే రోజుకు రెండు సిలిండర్లు కావాలి. బ్లాక్‌లో ఒక్కోటి రూ.3వేలు పెట్టి కొంటున్నాం. ఒకేసారి 6 సిలిండర్లు తీసుకున్నాం. అధికారులు తనిఖీలు చేసి అన్ని పట్టుకుపోయారు. అసలే గ్యాస్ కష్టాల్లో ఉన్నప్పుడు ఇలా చేయడంతో వ్యాపారం దెబ్బతింటుంది. ఇబ్బందులు పడలేక హోటల్ మూసేసుకుంటాం. రేట్లు పెంచితే కస్టమర్లు రావడం లేదు. పెంచకపోతే గిట్టుబాటు కావడం లేదు.

- రమేష్, హోటల్ నిర్వాహకుడు, నల్లగొండ

## నల్లగొండ.. బ్లాక్ దందా..



యాదాద్రి జిల్లా మోత్కూరులో భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద శుక్రవారం బారులు తీరిన వినియోగదారులు

### కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, సివిల్ సప్లై అధికారులు హెచ్చరిస్తున్నారు. అక్రమంగా నిల్వ, బ్లాక్ మార్కెటింగ్ చేయడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలకు అవసరమైన గ్యాస్ స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, తప్పుడు ప్రచారం నమ్మొద్దని సూచించారు.



### ఒక పూటనే ఓపెన్ చేస్తున్న..

పదేళ్లుగా ఉదయం, సాయంత్రం రెండు పూటలా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నా. ఏ రోజూ సిలిండర్ల కోసం ఇబ్బంది పడలేదు. ప్రస్తుతం గ్యాస్ కొరతతో ఒక్కపూటనే ఓపెన్ చేస్తున్నా. గ్యాస్ కోసం ఎంత ప్రయత్నం చేసినా దొరకడంలేదు. వ్యాపారం బాగా దెబ్బతింటున్నది. గ్యాస్ అందేలా ప్రభుత్వం చూడాలి.

- శ్రీనివాస్, బిందు టిఫిన్ సెంటర్, సంగారెడ్డి

## మెదక్‌లో తిప్పలు

**కలం, మెదక్:**

ఉమ్మడి మెదక్ జిల్లాలో సర్వర్లు డౌన్ అవుతుండడంతో వినియోగదారులకు గ్యాస్ బుక్ కావడంలేదు. దీంతో ఏజెన్సీల వద్ద భారీగా క్యూ కడుతున్నారు. కస్టమర్స్‌కు గ్యాస్ బుకింగ్ ప్రధాన సమస్యగా మారింది. ఏజెన్సీల వద్ద ఖాళీ సిలిండర్లను తీసుకొచ్చి ఎదురుచూస్తున్నారు. కొందరికి బుకింగ్ పూర్తి అయిన తర్వాత కంపెనీ మెసెజ్, ఓటీపీ రాకపోవడంతో ఏజెన్సీల వద్దకు వస్తున్నారు. కమర్షియల్ సిలిండర్లకు తీవ్ర కొరత వచ్చింది. దీంతో హోటల్స్, రెస్టారెంట్లు, టీ స్టాల్స్, చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం నడిచే ఫుడ్ స్టాల్స్ ఏదో ఒక టైంలో మాత్రమే నిర్వహిస్తున్నారు. గ్యాస్ కొరతతో కొందరు వ్యాపారులు ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారు. సంగారెడ్డి జిల్లాలో రోజూ సుమారు 8 వేల గ్యాస్ బుకింగ్స్ అవుతుండేవి. ప్రస్తుతం కొరత కారణంగా 25 వేల బుకింగ్స్ అవుతున్నాయని అధికారులు తెలిపారు.

**ఉమ్మడి మెదక్ జిల్లా**
- గ్యాస్ ఏజెన్సీలు - 77
- డొమెస్టిక్ కనెక్షన్‌లు- 11.60 లక్షలు
- కమర్షియల్ కనెక్షన్లు (సంగారెడ్డి): 28 వేలు



సంగారెడ్డిలో భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద కస్టమర్ల క్యూ

కలం
ప్రజల గళం...
360° SINGLE TOPIC
బుకింగ్ ప్రాబ్లమ్స్
శనివారం
14-03-2026
Follow on: Kalamtelugu
kalamdaily.com

# ఓరుగల్లు.. పరేషాన్

**ఉమ్మడి వరంగల్ జిల్లా**
గ్యాస్ ఏజెన్సీలు - 100కు పైగా
డొమెస్టిక్ కనెక్షన్లు- 7.85 లక్షలు
కమర్షియల్ కనెక్షన్లు-15 వేలు

**కలం, వరంగల్:**
ఉమ్మడి వరంగల్ జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని సంబంధిత అధికారులు చెప్తున్నా.. సిలిండర్లు బుక్ కాకపోవడంతో జిల్లావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక హోటల్ యజమానులు తమ వ్యాపారాలు బంద్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. కొన్ని ఏజెన్సీలు ఇప్పటికే హోటళ్లకు గ్యాస్ సరఫరా నిలిపేశాయి. దీంతో వ్యాపారులు, అక్కడ పనిచేసే సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు బ్లాక్‌లో గ్యాస్ కొనుగోలు చేస్తూ టిఫిన్ రేట్లు పెంచేశారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట్ సిటీల్లో ఎక్కడ చూసినా వంట గ్యాస్ గురించే చర్చ జరుగుతున్నది. ప్రధానంగా వరంగల్ ట్రై సిటీలో వంట గ్యాస్ కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అటు గ్యాస్ సిలిండర్ పై ఆశలు తెంచుకున్న వాళ్లు.. ఎలక్ట్రికల్ స్టవ్ దుకాణాలకు పరుగులు పెడుతున్నారు. దీంతో వరంగల్, హనుమకొండ నగరాల్లోని ఎలక్ట్రికల్ పొయ్యిలు అమ్మే దుకాణాలు రద్దీగా మారాయి. మరోవైపు వంట గ్యాస్ పై ఆందోళన చెందాల్సిన పనిలేదని పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్తున్నారు. గ్యాస్ నిల్వలు తగినన్ని ఉన్నాయని.. అందరూ ఒకేసారి ఎగబడొద్దని సూచిస్తున్నారు. కాగా, ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్పీసీ ఎల్, ఇండేన్ ఏజెన్సీల ద్వారా రోజుకు సుమారు 10 నుంచి 15 వేలకు పైగా సిలిండర్లు సరఫరా అవుతున్నాయి.



# కరీంనగర్‌లో కమర్షియల్ నిల్

**కలం, కరీంనగర్:**
ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు గ్యాస్ సరఫరాలో ఆటంకాల వల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీల ముందు బారులు తీరుతున్నారు. కమర్షియల్ సిలిండర్ కొరతతో డొమెస్టిక్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. గ్యాస్ ఆన్ లైన్ బుకింగ్ సమస్యగా మారింది. దీంతో గ్యాస్ దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. డొమెస్టిక్ వినియోగదారులకు ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది.

డొమెస్టిక్ సిలిండర్ సాధారణ రోజుల్లో బుక్ చేస్తే ఒకటి, రెండు రోజుల్లో వస్తుంది. ఇప్పుడు వారం దాటినా రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. కమర్షియల్ సిలిండర్ల సరఫరా ఆగిపోవడంతో టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, హాస్టళ్ల నిర్వాహకులు బ్లాక్ లో కొనుగోలు చేస్తున్నారు. డొమెస్టిక్ నుంచి కమర్షియల్ సిలిండర్లకు అక్రమంగా రీ ఫిల్లింగ్ కొనసాగిస్తున్నాయి. గ్యాస్ కొరతతో ఉమ్మడి జిల్లాలోని హోటళ్లు, హాస్పిటళ్లు, హాస్టళ్లలో కట్టెల పొయ్యిలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరోవైపు డొమెస్టిక్ గ్యాస్ అక్రమ వినియోగంపై విజిలెన్స్, సివిల్ సప్లయి అధికారులు దాడులు చేస్తున్నారు.



### బుకింగ్ చేసిన.. 20 రోజులు ఆగాలట..
మూడు రోజుల కింద గ్యాస్ బుకింగ్ చేశాను ఎంతకూ కాలేదు. ఏజెన్సీకి వెళ్తే సరిగా చెప్పడంలేదు. ఇంకో 20 రోజులు ఆగాలని చెప్పారు. నెల రోజుల గడుపు పూర్తయినా ఆన్ లైన్ బుకింగ్ కావడం లేదు. సర్వర్ సమస్య అంటున్నారు. అధికారులు స్పందించి ఆన్ లైన్ బుకింగ్ సమస్యను పరిష్కరించాలి.
**- మల్లేశం, వినియోగదారుడు, కరీంనగర్**

### బ్లాక్‌లో అమ్మితే.. కఠిన చర్యలు
వినియోగదారులు ఆన్ లైన్ లోనే సిలిండర్లను బుకింగ్ చేసుకోవాలి. ఏజెన్సీలు, గ్యాస్ గోదాముల వద్దకు వెళ్లొద్దు. హోటల్, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్లు మాత్రమే ఉపయోగించాలి. డొమెస్టిక్ వాడితే, బ్లాక్ మార్కెట్‌లో అమ్మాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.
**- నర్సింగరావు, డీఎస్‌వో, కరీంనగర్ జిల్లా**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా**
గ్యాస్ ఏజెన్సీలు - 100కు పైగా
డొమెస్టిక్ కనెక్షన్లు -10.77 లక్షలు
కమర్షియల్ కనెక్షన్లు-2.61 లక్షలు



కరీంనగర్ జిల్లాలో అక్రమంగా నిల్వ ఉంచిన సిలిండర్లను పట్టుకుని కేసు నమోదు చేసిన విజిలెన్స్ టాస్క్ ఫోర్స్ అధికారులు

# ఖమ్మంలో కటకట



**ఉమ్మడి ఖమ్మం జిల్లా**
గ్యాస్ ఏజెన్సీలు - 40
డొమెస్టిక్ కనెక్షన్లు - 7 లక్షలు
కమర్షియల్ కనెక్షన్లు - 18 వేలు

**కలం, ఖమ్మం:**
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్యాస్ కొరతతో సామాన్యులు, వ్యాపారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఏజెన్సీలు రోజుకు 4 వేల డొమెస్టిక్ సిలిండర్లను సరఫరా చేస్తున్నాయి. కమర్షియల్ గ్యాస్ పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. ఇంకో10 రోజులు పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ వ్యాపారాలన్నీ బంద్ పెట్టుకోవాల్సి వస్తుందని హోటళ్ల నిర్వాహకులు వాపోతున్నారు. గ్యాస్ కొరతపై ఉమ్మడి ఖమ్మం జిల్లాల కలెక్టర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్యాస్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ అక్రమంగా నిల్వలు ఉంచితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

### బుకింగ్ కోసం నాలుగురోజులు
నాలుగు రోజులుగా గ్యాస్ బుక్ చేద్దామని ప్రయత్నిస్తున్నా. ఈరోజు నంబర్ కలిసి బుకింగ్ అయింది. ఓటీపీ వస్తేనే సిలిండర్ ఇస్తామని గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది చెప్పడంతో వెళ్లి వెంటనే తెచ్చుకున్నాను. నాలుగు రోజుల తర్వాత సిలిండర్ దొరికింది.
**– నరేష్, కస్టమర్, ఖమ్మం**





### కూల్ డ్రింక్స్ అమ్ముతున్నా..
కమర్షియల్ సిలిండర్ దొరకడం కష్టంగా ఉంది. గ్యాస్ తో వండే వంటలను బంద్ చేశాను. ఇప్పటికే కూల్ డ్రింక్స్, నిమ్మరసం, మొక్కజొన్న కంకులు తెచ్చాను. ఎందుకంటే బిజినెస్ ఉన్నా లేకున్నా అద్దె కట్టాలి. అందుకే వేరే వస్తువులు తీసుకొచ్చి అమ్ముతున్నాను.
**– చిరంజీవి, ఖమ్మం**

# ఇందూరులో ఇక్కట్లు

**కలం, నిజామాబాద్:**
నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో వంటింటి గ్యాస్ టెన్షన్ పెడ్తున్నది. గ్యాస్ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో జనాలు మాత్రం ఏజెన్సీలకు క్యూ కడుతున్నారు. బుక్ చేసిన నాలుగైదు రోజుల వరకు సిలిండర్ రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఒక్కోసారి గ్యాస్ బుక్ కావడం లేదు. నిజామాబాద్ జిల్లాలో 33 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. డొమెస్టిక్, కమర్షియల్ కలిపి 5,81,769 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇరాన్ యుద్ధ ప్రభావం కారణంగా నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ, మండలాల్లో సిలిండర్ల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడానికి ఎన్ని సార్లు ప్రయత్నించినా సర్వర్ బిజీ వస్తున్నది. దీంతో వినియోగదారులంతా గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు తీరుతున్నారు. ఒక్కో కమర్షియల్ సిలిండర్ పై ఏజెన్సీ నిర్వాహకులు అదనంగా రూ.500 నుంచి రూ.800 తీసుకుంటున్నారని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ పాయింట్ యజమానులు ఆరోపిస్తున్నారు. అలాగే, డొమెస్టిక్ సిలిండర్‌పై బ్లాక్‌లో రూ.500 వరకు ఎక్స్‌ట్రా తీసుకుంటున్నారని జనాలు మండిపడుతున్నారు. కమర్షియల్ సిలిండర్లు దొరక్కపోవడంతో హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు కట్టెలు, బొగ్గుల పొయ్యిలు తెచ్చుకొని వంటలు చేస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల బార్డర్ మహారాష్ట్రలోని దెగ్లూర్ కు చెందిన హోటళ్ల నిర్వాహకులు బిచ్కుంద, మద్నూర్, పిట్లంలో కొందరిని మధ్యవర్తులుగా పెట్టుకొని డీలర్ల నుంచి డొమెస్టిక్ సిలిండర్లను కమీషన్‌పై అక్కడికి తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిలిండర్లు మహారాష్ట్ర తరలిపోతున్నాయని ప్రజలు అంటున్నారు. సిలిండర్ల కొరత కారణంగా టీ పాయింట్ నిర్వాహకులు బొగ్గులు వాడుతున్నారు. మరి కొందరు ఇండక్షన్ స్టవ్ ఉపయోగిస్తున్నారు. ఇక కామారెడ్డి జిల్లావాసులనూ గ్యాస్ కొరత తీవ్రంగా వేధిస్తున్నది. బాన్సువాడ, బీర్కూర్ మండల కేంద్రాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన సిలిండర్లను సివిల్ సప్లయ్, రెవెన్యూ, అధికారులు పట్టుకున్నారు.

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా**
గ్యాస్ ఏజెన్సీలు - 57
డొమెస్టిక్ కనెక్షన్లు - 7,14,587
కమర్షియల్ కనెక్షన్లు - 2,56,480

నిజామాబాద్ సిటీలో గ్యాస్ ఏజెన్సీ బుకింగ్ కౌంటర్ వద్ద రద్దీ





కామారెడ్డి జిల్లాలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

### 50 శాతం హోటళ్లు మూతపడ్డాయి
నిజామాబాద్‌లో 50% హోటళ్లు మూసేశారు. మరో మూడ్రోజుల్లో అన్ని మూతపడే పరిస్థితులు ఉన్నాయి. కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేక మూడు నాలుగు రోజులైంది. యుద్ధం ముగిసి మళ్లీ పరిస్థితులు చక్కబడే దాకా హోటళ్ల అవసరాల కోసం డొమెస్టిక్ సిలిండర్లు వాడుకునే అవకాశం ఇవ్వాలి. లేకపోతే మా వ్యాపారాలు దెబ్బతినడమే గాక కార్మికులు ఉపాధి కోల్పోతారు.
**- భాస్కర్ రెడ్డి, బిర్యానీ సెంటర్ ఓనర్**



### డొమెస్టిక్ సిలిండర్ల కొరత రానివ్వొద్దు
గ్యాస్ కొరతతో తీవ్ర ఇబ్బందులు పడ్తున్నాం. ఇంటి అవసరాల కోసం వాడే సిలిండర్ల కొరత రాకుండా చూడాలి. మహిళలు మాత్రం టెన్షన్ పడ్తున్నరు. నిజంగా కొరత లేకపోతే జనాలకు బుకింగ్, సరఫరాలో ఎక్కడా ఇబ్బంది కల్గకుండా చూడాలి. అప్పుడే జనాల్లో పానిక్ పరిస్థితులు తప్పుతాయి. ఏదేమైనా యుద్ధ ప్రభావం వంటింటి వరకు రాకుండా చేయగలిగితే.. జనాలకు ఇబ్బందులుండవు.
**- నూర్జహాన్, నిజామాబాద్**





నిజామాబాద్ సిటీలో గ్యాస్ ఏజెన్సీ వద్ద పోలీసుల బందోబస్తు